09-09-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

## " మధురమైన పిల్లలారా - ఏ పనినైనా యోగబలముతో చేయండి. తండ్రిని ఏ విషయమూ అడగనవసరము లేదు. మీరు ఈశ్వరీయ సంతానము. అందువలన ఎలాంటి ఆసురీ కర్మలు చేయకండి "

**ప్రశ్న:-** మీ యోగబలము చేయు చమత్కారమేది(అద్భుతమేది)?

**జవాబు :-** ఈ యోగబలముతోనే మీ కర్మేంద్రియాలన్నీ మీకు వశమౌతాయి. యోగబలము లేకుండా మీరు పావనంగా అవ్వలేరు. యోగబలము ద్వారానే ఈ సృష్టి అంతా పావనమౌతుంది. అందువలన పావనంగా అయ్యేందుకు, భోజనాన్ని శుద్ధంగా చేసేందుకు స్మృతియాత్రలో ఉండండి. యుక్తిగా నడుచుకోండి. నమ్రతతో వ్యవహరించండి.

**ఓంశాంతి.** ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు అర్థము చేయిస్తున్నారు - ఆత్మల తండ్రి వచ్చి స్వర్గము లేక నూతన ప్రపంచమునెలా స్థాపన చేస్తారో ప్రపంచములో ఎవ్వరికీ తెలియదు. మీరు తండ్రిని ఏమీ అడగరాదు. అడగకుండానే తండ్రి అన్నీ అర్థం చేయిస్తారు. మీరు ఏదీ అడిగే అవసరముండదు. స్వయంగా వారంతకు వారే అన్ని విషయాలు అర్థం చేయిస్తారు. తండ్రి అంటున్నారు - కల్ప-కల్పము నేను ఈ భారత ఖండములో వచ్చి ఏమి చేయాలో నాకు తెలుసు, మీకు తెలియదు. ప్రతి రోజూ అర్థము చేయిస్తూనే ఉంటారు. - భలే ఎవ్వరూ ఏమీ అడగకపోయినా ఒక పదము కూడా అడగనవసరము లేకుండా సర్వము అర్థం చేయిస్తూ ఉంటారు. అప్పుడప్పుడు ఆహారపానీయాల విషయంలో కష్టమవుతూ ఉందని బాబాను అడుగుతారు. ఇది అర్థము చేసుకోవలసిన విషయము. బాబా చెప్పేశారు - అన్ని విషయాలలో యోగబలముతో స్మృతి యాత్రతో పని చేయండి, ఎక్కడకు వెళ్లినా ముఖ్య విషయము - తండ్రిని తప్పకుండా స్మృతి చేయాలి. అంతేకాక ఆసురీ పనులేవీ చేయరాదు. మనము ఈశ్వరీయ సంతానము వారు అందరికి తండ్రి. వారు అందరికీ ఒకే రకమైన శిక్షణనిస్తారు - పిల్లలూ, మీరు స్వర్గానికి యజమానులుగా అవ్వాలని శిక్షణనిస్తున్నారు. రాజ్యములో కూడా హోదా ఉంటుంది కదా. ప్రతి ఒక్కరి పురుషార్థానుసారము పదవి ఉంటుంది. పిల్లలే పురుషార్థము చేయాలి. పిల్లలే ప్రాలబ్ధము పొందుకోవాలి. పురుషార్థము చేయించేందుకు తండ్రి వస్తారు. తండ్రి ఎప్పుడు వస్తారో, వారు వచ్చి ఏం చేస్తారో, ఎక్కడకు తీసుకెళ్తారో మీకు కొంచెము కూడా తెలియదు. ఆ తండ్రే వచ్చి డ్రామా ప్లాను అనుసారంగా మీరు ఎక్కడ నుండి క్రిందకు పడిపోయారో తెలుపుతున్నారు. ఒక్కసారిగా అత్యంత ఉన్నత శిఖరము నుండి క్రిందకు పడినారు. మనమెవరో కొద్దిగా కూడా బుద్ధికి తోచదు. ఇప్పుడు అనుభవము చేస్తున్నారు కదా. ఆ తండ్రి వచ్చి ఏం చేస్తారో మీకు స్వప్నములో కూడా లేదు. మీకు కూడా ఏమీ తెలియదు. ఇప్పుడు తండ్రి లభించినందున వారికెలా సమర్పణ అవ్వాలో మీకిప్పుడు తెలుసు. పతివ్రత స్త్రీ తన పతికి ఎంతగా సమర్పణవుతుంది! చితి పై కాలిపోయేందుకు కూడా వెనుకాడదు, భయపడదు, ఎంత సాహసము చేస్తుంది? ఇంతకు ముందు చితి పై చాలామంది తమ పతి శరీరముతో పాటు కాలిపోయేవారు. ఇక్కడ బాబా మీకు ఇలాంటి కష్టమునేదీ ఇవ్వరు. పేరేమో జ్ఞానచితి, కాని కాలిపోయే మాటే లేదు. వెన్నలో నుండి వెంట్రుకను ఎంత సులభంగా తీయగలరో అంత సులభము చేసి తండ్రి అర్థము చేయిస్తారు. జన్మ-జన్మాంతరాల భారము తల పై ఉందని పిల్లలకు బాగా తెలుసు. అజామిళుడు ఒక్కరు మాత్రమే కాదు. ఒకరికంటే మరొకరు గొప్ప అజామిళులే. గత జన్మలో ఏమేం చేశారో మానవులకేం తెలుసు? చేసినదంతా పాపమే అని, వాస్తవానికి పుణ్యాత్మ ఒక్కరు కూడా లేరని ఇప్పుడు మీకు

అర్థమయింది. అందరూ పాపాత్మలే. పుణ్యము చేస్తే కదా పుణ్యాత్మలయ్యేది. పుణ్యాత్ములు సత్యయుగంలో ఉంటారు. ఎవరైనా ఆసుపత్రి మొదలైనవి కట్టించినారనుకోండి ఏమవుతుంది? మెట్లు దిగకుండా ఉండేందుకు వీలే లేదు. ఉన్నతమయ్యే కళ ఉండదు కదా. క్రిందకు దిగజారుతూనే ఉంటారు. ఈ తండ్రి ఎంత ప్రియమైనవారంటే, బ్రతికి ఉండగానే వారి పై సమర్పణ అవుతామని అంటారు. ఎందుకంటే వారు పతులకు పతి, పితలకు పిత. అందరికంటే ఉన్నతమైనవారు.

పిల్లలను ఇప్పుడు తండ్రి మేల్కొల్పుతూ ఉన్నారు. స్వర్గానికి యజమానిగాగా చేసే బాబా ఎంత సాధారణంగా ఉన్నారు! ప్రారంభంలో పిల్లలు జబ్బుపడితే, స్వయంగా బాబాయే వారికి సేవ చేసేవారు. అహంకారము ఏ మాత్రమూ లేదు. బాప్‌దాదా అత్యంత ఉన్నతమైనవారు. నేను వీరితో కర్మ చేయిస్తాను లేక చేస్తాను. ఇరువురూ ఒక్కరే అనిపిస్తారు. తండ్రి ఏం చేస్తారో, దాదా ఏం చేస్తారో అర్థము కాదు. కర్మ-అకర్మ-వికర్మల గతి తండ్రే కూర్చొని అర్థము చేయిస్తున్నారు. తండ్రి చాలా ఉన్నతమైనవారు. మాయ ప్రభావము కూడా ఎంతో ఎక్కువగా ఉంది. ఈశ్వరుడైన తండ్రి, ఇలా చేయవద్దని చెప్పినా వినరు. భగవంతుడంటున్నారు - మధురమైన పిల్లలూ, ఇలాంటి ఉల్టా(వ్యతిరేకమైన) పని చేయకండి అని చెప్పినా, ఉల్టా కర్మలు చేసేస్తారు. ఉల్టా కర్మలు చేయవద్దని చెప్తారు కదా కాని మాయ కూడా చాలా శక్తివంతమైనది. పొరపాటున కూడా తండ్రిని మర్చిపోరాదు. ఏం చేసినా, కొట్టినా లేక నలిపేస్తున్నా మర్చిపోరాదు కాని తండ్రి అలా ఎప్పటికీ చేయరు. కాని చాలా అతిసమయము(ఎక్స్‌ట్రీమ్) గురించి ఈ మాట అంటారు. మీ గడపను ఎప్పుడూ వదిలిపెట్టమని పాట కూడా పాడ్తారు. ఏం చెప్పినా బయట ప్రపంచంలో ఏముంది? ఇక ఎక్కడకెళ్తావు? అని బుద్ధి కూడా ప్రశ్నిస్తుంది. తండ్రి చక్రవర్తి పదవిని ఇస్తారు, తర్వాత దొరకనే దొరకదు. మరో జన్మలో లభిస్తుందనేది లేనే లేదు. దొరకదు. వీరు పారలౌకిక తండ్రి - బేహద్ సుఖధామానికి మిమ్ములను యజమానులుగా చేస్తారు. పిల్లలు దైవీగుణాలు కూడా ధారణ చేయాలని తండ్రి సలహా ఇస్తున్నారు. మీ కర్తవ్యాలైన పోలీసు, మొదలైన పనులు కూడా చేయండి లేకుంటే డిస్మిస్ చేస్తారు. మీ పని మీరు చేయాల్సిందే, కన్నెర్ర చేయాల్సి ఉంటుంది. వీలైనంత ప్రేమతో పని చేయించాలి. అలా పని అవ్వకుంటే, యుక్తిగా కోప భావముతో చూడండి చేతిని ఉపయోగించరాదు(కొట్టరాదు). బాబాకు అనేకమంది పిల్లలున్నారు. బాబాకు కూడా పిల్లల గురించిన ఆలోచన ఉంటుంది కదా. ముఖ్యమైనది పవిత్రంగా ఉండడం. జన్మ-జన్మాంతరాలు మీరు “ఓ పతితపావనా! వచ్చి మమ్ములను పావనంగా చేయండి” అని పిలుస్తూ వచ్చారు కదా. కాని దీని అర్థము కొంచెము కూడా తెలియదు. పిలిచేది పతితులే కదా. లేకుంటే పిలిచే అవసరము కూడా లేదు. పూజించే అవసరము కూడా లేదు. తండ్రి అర్థము చేయిస్తున్నారు - అబలలైన మీ పై చాలా అత్యాచారాలు జరుగుతాయి. సహించే తీరాలి. బాబా యుక్తులను కూడా తెలియజేస్తుంటారు చాలా వినయంతో నడుచుకోండి. ‘మీరు నాకు దేవుడు కదా. ఇది నన్నెందుకు అడుగుతారు?’ అని వినయంగా అడగండి. కంకణము కట్టినప్పుడు ‘నేను నీకు పతి పరమేశ్వరుడను, గురువును, సర్వమూ నేనే’ అన్నారు కదా. ‘ఇప్పుడు నేను పవిత్రంగా ఉండదలచాను, మీరెందుకు నన్ను అడ్డుకుంటారు. భగవంతుని పతితపావనుడని అంటారు కదా. మీరే నన్ను పావనంగా చేయువారుగా అవ్వండి.’ ఇలా ప్రేమతో వినయంగా మాట్లాడాలి. వారు కోపగిస్తే, వారి పై పుష్పాలవర్షము కురిపించండి. కొట్టిన తర్వాత పశ్చాత్తాపపడ్తారు. కాని అలవాటు పడ్డారు. ఎలాగైతే తాగే అలవాటున్నవారికి చాలా నషా పెరిగిపోయి, తమను తాము చక్రవర్తులుగా భావిస్తారో అలా ఈ విషము కూడా అలాంటిదే, అడగనే అడగకండి. పశ్చాత్తాపపడ్తారు కూడా. కాని అలవాటు పడినందున అది తొలగదు. 1-2 సార్లు వికారాలకు వశమౌతే చాలు. నషా పెరుగుతుంది. పడ్తూనే ఉంటారు మత్తుపదార్థాలు ఎలాంటి ఖుషీనిస్తాయో, వికారాలు కూడా అటువంటివే. ఇక్కడ చాలా శ్రమ

పడాలి. యోగబలము లేకుండా, ఏ కర్మేంద్రియాలనూ వశపర్చుకోలేరు. గొప్పతనమంతా(అద్భుతమంతా) యోగబలముదే.అందుకే యోగమను పేరు అంత ప్రసిద్ధి చెందింది. ఇక్కడ యోగము నేర్చుకునేందుకు విదేశాల నుండి వస్తారు. శాంతిగా కూర్చొని ఉంటారు. ఇల్లు-వాకిళ్ళ నుండి దూరమవుతారు. అది అర్ధకల్పము కొరకు కృత్రిమ శాంతి. సత్యమైన శాంతి గురించి ఎవ్వరికీ తెలియదు. తండ్రి చెప్తున్నారు - పిల్లలూ, శాంతి మీ స్వధర్మము. శరీరముతో కర్మలాచరిస్తారు. ఎంతవరకు శరీరాన్ని ధారణ చేయరో అంతవరకు ఆత్మ శాంతిగా ఉంటుంది. తర్వాత ఎక్కడో ఒక చోటికి వెళ్ళి శరీరములో ప్రవేశిస్తుంది. ఇక్కడ కొందరు సూక్ష్మ శరీరముతో ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. అది నీడ వంటి శరీరము. కొన్ని దుఃఖము కలుగజేసేవిగా, కొన్ని మంచివిగా ఉంటాయి. ఇక్కడ కూడా కొంతమంది మనుష్యులు ఎవ్వరికీ దుఃఖమునివ్వరు. కొంతమంది చాలా దుఃఖమిస్తారు. కొంతమంది సాధువుల వలె, మహాత్ముల వలె ఉంటారు.

తండ్రి అర్థము చేస్తున్నారు - మధురాతి మధురమైన అపురూప పిల్లలారా, మీరు 5 వేల సంవత్సరాల తర్వాత మళ్ళీ వచ్చి నన్ను కలుసుకున్నారు. ఏం తీసుకునేందుకు? ఇక్కడ మీకు ఏం లభిస్తుందో తండ్రి అర్థము చేయించారు. బాబా మీ నుండి మాకు ఏం లభిస్తుంది అనేది ప్రశ్నే కాదు. మీరు హెవెన్లీ గాడ్‌ఫాదర్. నూతన ప్రపంచ రచయిత. అందువలన మీ నుండి మాకు తప్పకుండా చక్రవర్తి పదవే లభిస్తుంది. తండ్రి అంటున్నారు - కొంచెము అర్థము చేసుకున్నా స్వర్గములోకి తప్పకుండా వచ్చేస్తారు. నేను స్వర్గస్థాపన చేసేందుకు వచ్చాను. చాలా గొప్ప ఆసామి భగవంతుడు మరియు ప్రజాపిత బ్రహ్మ. విష్ణువు అంటే ఎవరో మీకు తెలుసు. ఇతరులెవ్వరికీ తెలియదు. మేము వీరి వంశస్థులమని అంటారు. ఈ లక్ష్మీనారాయణులు సత్యయుగంలో రాజ్యపాలన చేస్తారు. ఈ చక్రము మొదలైన అలంకారాలు వాస్తవానికి విష్ణువుకు లేవు. ఈ అలంకారాలు బ్రాహ్మణులైన మీవే. ఇప్పుడు మీకు మాత్రమే ఈ జ్ఞానముంది. సత్యయుగంలో ఈ విషయాలు అర్థం చేయించరు. ఇటువంటి విషయాలు తెలిపేందుకు ఎవ్వరికీ శక్తి లేదు. మీకు 84 జన్మల చక్రము గురించి తెలుసు. దీనిని ఎవ్వరూ అర్థము చేసుకోలేరు. పిల్లలకు తండ్రి అర్థం చేయించారు మాకు ఈ అలంకారాలు శోభించవని పిల్లలు అర్థము చేసుకున్నారు. మనము ఇంకా శిక్షణ పొందుతున్నాము. పురుషార్థము చేస్తున్నాము. ఆ తర్వాత ఇలా తయారవుతాము. స్వదర్శన చక్రాన్ని త్రిప్పుతూ-త్రిప్పుతూ మనము దేవతలుగా అవుతాము. స్వదర్శన చక్రమంటే రచయిత-రచనల ఆదిమధ్యాంతాలను తెలుసుకోవడం. ఈ మొత్తం ప్రపంచములో సృష్టిచక్రమెలా తిరుగుతుందో ఇతరులెవ్వరూ అర్థము చేయించలేరు. తండ్రి ఎంత సులభంగా అర్థం చేయిస్తున్నారు. ఈ చక్రము ఆయువు ఇంత పెద్దదిగా ఉండేందుకు వీలు లేదు. మానవ సృష్టి గురించి మాత్రమే ఇంతమంది మనుష్యులున్నారని తెలిపిస్తారు. అంతేకాని తాబేళ్ళు ఎన్ని ఉన్నాయో, చేపలెన్ని ఉన్నాయో తెలుపరు. మానవుల విషయము మాత్రమే తెలియజేస్తారు. మిమ్ములను కూడా ప్రశ్నిస్తూ ఉంటారు. తండ్రి అన్ని విషయాలు తెలిపిస్తూ ఉంటారు. కేవలం వాటి పై పూర్తిగా గమనముంచాలి.

బాబా అర్థం చేయించారు - యోగబలముతో మీరు సృష్టిని పావనంగా చేస్తారు. అటువంటప్పుడు యోగబలముతో ఆహారము శుద్ధము చేసుకోలేరా? మంచిదే. మీరైతే ఇలా తయారయ్యారు. మరి మీ సమానంగా ఎవరినైనా తయారుచేశారా? స్వర్గ సామ్రాజ్యమునిచ్చేందుకు మళ్ళీ తండ్రి వచ్చారని మీకు తెలుసు. అందువలన తిరస్కరించకండి, విశ్వ చక్రవర్తి పదవి వద్దంటే సమాప్తమైపోతారు. తిరస్కరించారంటే మళ్ళీ వెళ్ళి చెత్తకుండిలో పడ్తారు. ఈ ప్రపంచమంతా చెత్త లేక మురికిగానే ఉంది. అందువలన దీనిని చెత్తకుండి అనే అంటారు. ప్రపంచ పరిస్థితి ఎలా ఉందో గమనించండి. విశ్వమంతటికీ యజమానులుగా అవుతామని మీకు తెలుసు. సత్యయుగంలో ఒకే రాజ్యముండేదంటే ఎవ్వరూ అంగీకరించరు. చెప్పినా నమ్మరు, ఒప్పుకోరు. గర్వము వలన వినను కూడా

వినరు. ఇదంతా మీ కల్పన అని అంటారు. ఈ శరీరము మొదలైనవన్నీ కల్పన ద్వారానే తయారయ్యాయి. కొంచెం కూడా అర్థము చేసుకోరు. ఇది ఈశ్వరుని కల్పన. ఈశ్వరుడు కోరినట్లు తయారౌతాము. ఈ నాటకమంతా ఆయనదే.... ఎలాంటి మాటలు మాట్లాడ్తారంటే చెప్పలేము. తండ్రి వచ్చారని పిల్లలైన మీకిప్పుడు తెలుసు. వృద్ధ స్త్రీలు కూడా బాబా ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత మేము మీ నుండి స్వర్గ వారసత్వము తీసుకుంటామని అంటారు. ఇప్పుడు మనము స్వర్గ రాజ్యాన్ని తీసుకునేందుకు వచ్చాము. పాత్రధారులందరికీ ఎవరి పాత్ర వారికి ఉందని మీకు తెలుసు. ఒకరి పాత్ర ఇంకొకరి పాత్ర సమానంగా ఉండదు. మీరు మళ్లీ ఇదే నామ-రూపాలతో, ఇదే సమయంలో తండ్రి నుండి వారసత్వము తీసుకునే పురుషార్థము చేస్తారు. ఇది ఎంత గొప్ప సంపాదన. బాబా భలే చెప్తారు - కొద్దిగా విన్నా స్వర్గంలోకి వచ్చేస్తారు కాని ప్రతి మనిషి ఉన్నతంగా అయ్యేందుకే పురుషార్థము చేస్తారు కదా. కనుక మొదటిది పురుషార్థము. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

***ధారణ కొరకు ముఖ్య సారము :-***

1. ఎలాగైతే బాబా పిల్లల సేవ చేస్తున్నారో, ఏ అహంకారము లేదో అలా బాబాను అనుసరించాలి. తండ్రి శ్రీమతమును అనుసరిస్తూ విశ్వమంతటికీ చక్రవర్తి పదవిని తీసుకోవాలి, తిరస్కరించరాదు.
2. అత్యంత ఉన్నతులు, అత్యంత ప్రియులు, పితలకు పిత, పతులకు పతి అయిన తండ్రి పై జీవించి ఉంటూ సంపూర్ణ సమర్పణమవ్వాలి. జ్ఞానచితి పై కూర్చోవాలి. ఎప్పుడూ పొరపాటుగానైనా తండ్రిని మర్చిపోయి ఉల్టా(వ్యతిరేకమైన) కర్మలు చేయరాదు.

## వరదానము :- " మాస్టర్ జ్ఞాన సాగరులుగా అయి జ్ఞాన లోతులలోకి వెళ్ళే అనుభవాలనే రత్నాలతో సంపన్న భవ "

ఏ పిల్లలైతే జ్ఞానలోతుల్లోకి వెళ్తారో వారు అనుభవాలనే రత్నాలతో సంపన్నంగా అవుతారు. ఒకటేమో జ్ఞానం వినడం వినిపించడం, రెండవది అనుభవీ మూర్తులుగా అవ్వడం. అనుభవస్థులు సదా అవినాశిగా, నిర్విఘ్నంగా ఉంటారు. వారిని ఎవ్వరూ కదిలించలేరు. అనుభవస్థుల ముందు మాయ చేసే ప్రయత్నమేదీ సఫలమవ్వదు. వారెప్పుడూ మోసపోరు. అందువలన అనుభవాలను పెంచుకుంటూ ప్రతి గుణమును అనుభవం చేసి అనుభవీ మూర్తులుగా అవ్వండి. మనన శక్తి ద్వారా శుద్ధ సంకల్పాల స్టాకును జమ చేసుకోండి.

## స్లోగన్ :- " ఎవరైతే సూక్ష్మ దేహాభిమాన సంబంధము నుండి కూడా భిన్నంగా ఉంటారో, వారే ఫరిస్తాలు. "